సాక్షి సూర్యాపేట

మంగళవారం : 11 : మార్చి : 2025




నిరుద్యోగ యువతే టార్గెట్

ఉద్యోగాల పేరిట రూ.లక్షల్లో వసూలు చేసి మోసం చేసిన నకిలీ డీఎస్పీని పోలీసులు రిమాండ్ చేశారు. - 8లో



వ్యవస్థాపకుడి అరెస్ట్

నాసిరకం వస్తువలు అమ్మి సొమ్ము చేసుకుంటున్న ఎంఎల్ఎం వ్యవస్థాపకుడిని అరెస్ట్ చేశారు. - 8లో



న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన నూతన ఎస్పీ



భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన కె.నరసింహ సోమవారం కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, కేసుల దర్యాప్తు, కేసుల్లో నేరస్తులకు శిక్ష అమలు, అక్రమ రవాణా నిరోధం, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలన, పోలీసు సేవలు తదితర అంశాలపై చర్చించారు.

దరఖాస్తుల ఆహ్వానం

భానుపురి (సూర్యాపేట) : గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2025–26 విద్యా సంవత్సరానికి బోయినపల్లిలో వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో 5వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమాధికారి కె.శంకర్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 2025 ఆగస్టు 31 నాటికి 9 నుంచి 11 ఏళ్ల వయస్సు ఉండి ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న జిల్లాలోని గిరిజన విద్యార్థినీ విద్యార్థులు అర్హులని తెలిపారు. ఈనెల 11వ తేదీ నుంచి దరఖాస్తు ఫారాలను పొంది ఈనెల 17వ తేదీ లోగా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. ఇతర వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నేడు ఎస్సీ, ఎస్టీ కమిషన్ పర్యటన

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ బక్కి వెంకటయ్య పర్యటించనున్నట్లు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో సమావేశం ఉంటుందని తెలిపారు.

ఇంటర్ ఇంగ్లిష్ పరీక్షకు 7,424 మంది హాజరు

సూర్యాపేటటౌన్ : ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షను 32 కేంద్రాల్లో నిర్వహించారు. ఈ పరీక్షకు 7,704 మంది విద్యార్థులకు 280 మంది గైర్హాజరు కాగా 7,424 మంది హాజరైనట్లు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్‌పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు చెప్పారు.

ప్రణయ్ హత్యకేసు తీర్పు చెంపపెట్టు లాంటిది



మాట్లాడుతున్న స్కైలాబ్ బాబు

భానుపురి (సూర్యాపేట) : పెరుమాళ్ల ప్రణయ్ హత్య కేసు తీర్పు కుల దురహంకారులకు చెంపపెట్టు లాంటిదని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్ బాబు అన్నారు. ప్రణయ్ హత్యకేసు తీర్పుపై సోమవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో సూర్యాపేటలోని సీపీఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కోట గోపి అధ్యక్షతన చర్చాగోష్ఠి నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడారు. కోర్టులపై ప్రజలకు నమ్మకం కలిగే విధంగా ప్రణయ్ కేసు తీర్పు ఉందన్నారు. రాష్ట్రంలో 128 కుల దురహంకార హత్యలు జరిగాయన్నారు. ఇటీవల సూర్యాపేటలో వడ్లకొండ కృష్ణను అతి కిరాతకంగా హత్య చేశారని, ఈ కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు తల్లమళ్ల హస్సన్, సీనియర్ జర్నలిస్ట్ బంటు కృష్ణ, పల్లె మనిబాబు, శిరంషెట్టి ఆనంద్, వెంకన్న, జె.నరసింహారావు, వెంకట్ రెడ్డి, నాగయ్య, దేవయ్య, వెంకటనరసయ్య, బోయిల్ల అఖిల్, సుధాకర్, సతీష్ పాల్గొన్నారు.

ఆరున్నరేళ్లకు.. అంతిమ తీర్పు

ప్రణయ్ హత్య కేసులో 1600 పేజీల్లో చార్జిషీట్

- కేసులో ప్రధాన పాత్రధారి అబ్దుల్‌బారి
- కరుడుగట్టిన నేరస్తుడు అజ్గర్ అలీ
- ఏ2 సుభాష్‌కుమార్ శర్మకు ఉరి.. మిగతా ఆరుగురికి జీవిత ఖైదు



ప్రణయ్ పరువు హత్య కేసు తీర్పు అనంతరం నిందితులను నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకొస్తున్న పోలీసులు



కోర్టు వద్ద మాట్లాడుతున్న స్పెషల్ పీపీ దర్శనం నర్సింహ

రామగిరి(నల్లగొండ) : మిర్యాలగూడ పెరుమాళ్ల ప్రణయ్ హత్య కేసు రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది. ఈ హత్య కేసులో ఆరున్నరేళ్లకు అంతిమ తీర్పు వచ్చింది. ఈ కేసులో మొత్తం 8 మందిని నిందితులుగా చేర్చుతూ పోలీసులు కోర్టులో చార్జిషీటు సమర్పించారు. ఈ కేసులో ఏ1 తిరునగరు మారుతిరావు, ఏ2 సుభాష్‌కుమార్‌శర్మ, ఏ3 మహ్మద్ అజ్గర్‌అలీ, ఏ4 మహ్మద్ అబ్దుల్‌బారి, ఏ5 అబ్దుల్ కరీం, ఏ6 తిరునగరు శ్రవణ్‌కుమార్, ఏ7 సముద్రాల శివ, ఏ8 ఎంఏ.నిజాం నిందితులుగా ఉన్నారు. అందులో ఏ3 మహ్మద్ అజ్గర్‌అలీకి కరడుగట్టిన నేరచరిత్ర ఉంది. ఈ హత్యలో అజ్గర్‌అలీ, సుభాష్‌కుమార్ శర్మకు ఇద్దరికి పరిచయం ఉన్న వ్యక్తి అబ్దుల్‌బారీ. అబ్దుల్ బారీనే కరడుగట్టిన నేరస్తుడు అజ్గర్ అలీని రంగంలోకి దింపాడు. గుజరాత్ హోంమంత్రి హరేన్ పాండ్య హత్య కేసులో అజ్గర్ అలీ నిందితుడు. వీరిలో ఏ1 మారుతీరావు ఆత్మహత్య చేసుకోగా.. ఏ2 సుభాష్‌కుమార్ శర్మకు కోర్టు ఉరిశిక్ష.. మిగతా ఆరుగురు నిందితులకు జీవిత ఖైదు విధించింది.



రోదిస్తున్న నిందితుల కుటుంబ సభ్యులు

102 మంది సాక్షుల విచారణ

ఈ కేసులో మొత్తం చార్జిషీట్‌ను 1600 పేజీల్లో రూపొందించి నల్లగొండ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టులో సమర్పించారు. ప్రణయ్ హత్య కేసులో ప్రధాన నిందితుల ప్రత్యక్ష, పరోక్ష పాత్ర ఏ స్థాయిలో ఉంది.. ఎవరెవరు ఏ విధంగా సహకరించారనే అంశాలను 63 పేజీల్లో పొందుపర్చారు. బిహార్‌కు చెందిన కిల్లర్ సుభాష్‌కుమార్‌శర్మతో డీల్ కుదిర్చింది ఎవరు..? అతడిని మిర్యాలగూడకు రప్పించి వసతులు సమకూర్చింది ఎవరు..? సుపారీలో ఎవరి వాటా ఎంత..? అతనికి ఏ విధంగా సహకరించారు..? హత్య అనంతరం సుపారీ కిల్లర్ ఎలా పారిపోయాడు..? ఎవరు సహకరించారు..? అనే కోణంలో విచారణ సాగింది. ప్రణయ్ హత్యను ప్రత్యక్ష, పరోక్షంగా చూసిన 102మంది సాక్షులను పోలీసులు విచారించి వారి వాంగ్మూలాలన్ని చార్జిషీట్‌లో రికార్డు చేశారు. దీంతో పాటు ఫోరెన్సిక్, పోస్టుమార్టం రిపోర్టుల ఆధారంగా సైంటిఫిక్ ఎవిడెన్స్‌ను సమకూర్చారు.

ఇదీ దోషుల పాత్ర..

మిర్యాలగూడకు చెందిన పెరుమాళ్ల ప్రణయ్, అమృతవర్షిణికి 2018 జనవరి30 న ప్రేమ వివాహం జరిగింది. ఈ వివాహాన్ని అమృతవర్షిణి తండ్రి ఏ1 మారుతీరావు జీర్ణించుకోలేకపోయాడు. ఎలాగైనా ప్రణయ్‌ను హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. ప్రణయ్‌ని చంపాలన్న విషయాన్ని తన మిత్రుడు, మిర్యాలగూడ మున్సిపల్ వార్డు కౌన్సిలర్, ఏ5 అయిన అబ్దుల్ కరీంకు చెప్పాడు. వారు ఇద్దరు చర్చించుకొని ఏ4 మహ్మద్ అబ్దుల్ బారీని మారుతీరావుకు పరిచయం చేశాడు. ప్రణయ్‌ను హత్య చేసేందుకు మారుతీరావుకు మహ్మద్ అబ్దుల్‌బారి మధ్య రూ.కోటి సుపారీ ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. అడ్వాన్స్‌గా రూ.15 లక్షలు ఏ5 మహ్మద్ కరీం, మారుతీరావు కారు డ్రైవర్ ఏ7 సముద్రాల శివ ద్వారా అబ్దుల్ బారికి అప్పజెప్పాడు. డబ్బులు తీసుకున్న తర్వాత అబ్దుల్ బారి.. ప్రణయ్‌ను హత్య చేయాలని ఏ3 అజ్గర్‌అలీకి, అంతకు ముందు రాజమండ్రి జైల్‌లో పరిచయం ఉన్న ఏ2 శుభాష్‌కుమార్‌శర్మకు చెప్పాడు. వీరికి ఆటోడ్రైవర్ అయిన ఏ8 ఎం ఏ.నిజాం సహకరించాడు. ముగ్గురూ కలిసి ప్రణయ్‌ను హత్య చేసేందుకు పలుమార్లు రెక్కీ నిర్వహించారు. 2018, సెప్టెంబర్ 14 న మిర్యాలగూడలోని జ్యోతి ఆస్పత్రిలో చెకప్ కోసం ప్రణయ్, అమృతవర్షిణి, ప్రణయ్ తల్లి ప్రేమలత వెళ్లారు. ఇంటి వద్ద నుంచే ప్రణయ్ ప్రయాణించే కారును వారు అనుసరించారు. వారికంటే ముందుగానే సుభాష్‌కుమార్‌శర్మ, అజ్గర్ అలీ టూ వీలర్‌పై, ఆటో డ్రైవర్ ఎంఏ.నిజాం ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. ఆసుపత్రిలో చూపించుకుని ప్రణయ్, అమృత, ప్రేమలత తిరిగి వస్తున్న క్రమంలో సుభాష్‌కుమార్‌శర్మ కత్తితో ప్రణయ్‌పై దాడి చేశాడు. హత్య చేసిన తర్వాత సుభాష్‌కుమార్‌శర్మ, అజ్గర్‌అలీ, ఏంఏ నిజాం పారిపోయారు. ఆ తర్వాత ఏ1 మారుతీరావు, ఏ6 తిరునగరు శ్రవణ్‌కుమార్‌కు.. ఏ7 సముద్రాల శివ సూర్యాపేటలోని బావ ఇంట్లో ఆశ్రయం కల్పించాడు. ఈ హత్యలో ఏ6 శ్రవణ్‌కుమార్ నగదు సమకూర్చాడు. ప్రత్యక్షంగా హత్యకు పాల్పడిన ఏ2 శుభాష్‌కుమార్‌శర్మకు మరణశిక్ష విధించగా, మిగిలిన ఆరుగురికి జీవితఖైదు పడింది.

పకడ్బందీగా దర్యాప్తు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ప్రణయ్ హత్య కేసును పోలీసు యంత్రాంగం పకడ్బందీగా దర్యాప్తు చేసింది. కేసు విచారణ, పక్కాగా సాక్ష్యాల సేకరణ, వాటి అథెంటికేషన్ విషయంలో అప్పటి ఎస్పీ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో పోలీసు బృందాలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నాయి. తమిళనాడులో శంకరన్ హత్య కేసు తరహాలో ప్రణయ్ హత్య కేసు విచారణ జరిగింది. తమిళనాడులో కులాంతర వివాహం చేసుకున్న శంకరన్ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి.. అక్కడ ఆయన హత్యకు గురయ్యాడు. ఆ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న తమిళనాడు పోలీసులు నిందితులకు కఠిన శిక్ష పడేలా పక్కాగా విచారణ జరిపారు. అందుకే ప్రణయ్ హత్య తరువాత అప్పటి ఎస్పీ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో పోలీసు అధికారుల బృందం అక్కడికి వెళ్లి ఆ కేసును కూడా పరిశీలించింది. ప్రణయ్ హత్య కేసులోనూ నిందితులు తప్పించుకోకుండా, సాక్ష్యాధారాలు తారుమారు కాకుండా, సాంకేతిక పద్ధతుల్లో వాటిని భద్రపరిచారు. ముఖ్యంగా హత్యకు ఉపయోగించిన ఆయుధాలు, బ్లడ్ శాంపిల్స్, ప్రభుత్వ, ప్రైవేట్ ల్యాబ్‌ల్లో పరీక్ష చేయించారు. అంతేకాదు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ప్రణయ్ హత్యకు ముందు నిందితులు ఏయే ప్రాంతాల్లో సంచరించారు.. ఎవరెవరు కలుసుకొని ప్లాన్ చేశారు.. అనే వివరాలు సేకరించి అన్ని ఆధారాలను కోర్టులో సమర్పించారు. ఈ కేసులో ఎలాంటి అవకతవకలకు, అనుమానాలకు తావులేకుండా నేరం రుజువయ్యేలా సేకరించిన అన్ని సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించారు. తద్వారానే సుభాష్ కుమార్ శర్మకు అప్పట్లో బెయిల్ రాలేదు. కేసు విచారణ తుది తీర్పులో సుభాష్ శర్మకు ఉరి శిక్ష, మిగిలిన వాళ్లకు జీవిత ఖైదు పడిందని, తద్వారా బాధితులకు సత్వర న్యాయం జరిగిందని పోలీసు అధికారి ఒకరు పేర్కొన్నారు.



కోర్టు ఆవరణలో శ్రవణ్ కుటుంబ సభ్యులు



తీర్పు నేపథ్యంలో నల్లగొండ కోర్టు వద్ద పోలీసుల బందోబస్తు

పిల్లలకు 'ప్రేమ'గా చెప్పాలి | ప్రణయ్ హత్య కేసు కొనసాగిందిలా.. | కోర్టు వద్ద తీవ్ర ఉత్కంఠ.. | వివరాలు 8లో▸

ఒకరి ప్రేమ.. మరొకరి అహం..

ప్రణయ్ హత్యతో రెండు కుటుంబాల్లోనూ విషాదం

- కలలు చెదిరిపోయి, ఊరు విడిచి వెళ్లిపోయిన అమృత
- కొడుకు లేక విలపిస్తున్న ప్రణయ్ తల్లిదండ్రులు



ప్రణయ్ సమాధిపై పుష్పాంజలి ఘటిస్తున్న తల్లిదండ్రులు

సాక్షిప్రతినిధి, నల్లగొండ: ఒకరి ప్రేమ.. మరొకరి అహం.. ఆ కుటుంబాలను చెల్లాచదురు చేసింది. ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు చేసుకున్న ప్రేమ వివాహాన్ని జీర్ణించుకోలేని ఆ తండ్రి తీసుకున్న నిర్ణయం ఓ ప్రాణాన్ని బలితీసుకోగా, చివరకు ఆ తండ్రే తనకు తానే తనువు చాలించాడు. అదే ప్రణయ్, అమృత వర్షిణి ప్రేమ వ్యవహారంలో చివరి మజిలీగా మిగిలింది. మిర్యాలగూడ పట్టణంలో స్కూల్లో 9వ తరగతి చదువుతున్నప్పటి నుంచే ప్రేమించుకున్న వారిద్దరు 2018 జనవరి 30న ఒక్కటయ్యారు. కొద్దిరోజులకే ఆమె కడుపులో మరో జీవి ప్రాణం పోసుకుంది. అయినా ఆమె తండ్రి తిరునగరు మారుతీరావు పరువు.. ప్రతిష్ట అంటూ అల్లుడు ప్రణయ్‌ని హత్య చేయించి కూతురు జీవితాన్ని చీకటిమయం చేశారు. చివరకు తాను ఆత్మహత్య చేసుకున్నారు. ప్రేమించుకుని ఎన్నో ఆశలతో ఒక్కటైన ప్రణయ్ అమృతవర్షిణి కలల ప్రపంచం చెదిరిపోయింది. వృద్ధాప్యంలో అండగా ఉంటాడని అనుకున్న ప్రణయ్ తల్లిదండ్రులు పెరుమాళ్ల బాలస్వామి, ప్రేమలత దంపతులకు ప్రణయ్ హత్య తీరని దుఃఖాన్ని మిగిల్చింది. ప్రణయ్ హత్య, మారుతీరావు ఆత్మహత్యతో ఆ రెండు కుటుంబాలు అగాథంలో పడ్డాయి.

కడుపుతో ఉన్నా కరుగని మనస్సు..

కూతురు గర్భిణిగా ఉన్నా ఆ తండ్రి మనస్సు కరుగలేదు. అల్లుడిగా ప్రణయ్‌ని అంగీకరించకపోయినా, పట్టించుకోకుండా వదిలేసినా సరిపోయేది. కానీ పరువు పేరుతో ప్రణయ్‌ని హత్య చేయించాడు. ఈ కేసులో మారుతీరావుతోపాటు హత్యలో భాగస్వాములైన ఏడుగురిని అరెస్టు చేశారు. ఆ తరువాత అమృత మగ బిడ్డకు జన్మనిచ్చింది. రెండేళ్ల కాలం గడిచింది. తన భర్త మరణానికి న్యాయం కావాలని, తండ్రికి మరణ శిక్ష పడాలని కన్న కూతురే డిమాండ్ చేయడంతో మారుతీరావు మనోవేదనలో పడ్డారు. 2020 మార్చి 8న హైదరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో ఆయన ఆత్మహత్య చేసుకున్నాడు.

చిన్నాభిన్నమైన కుటుంబాలు

ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్న పెరుమాళ్ల ప్రణయ్ తండ్రి బాలస్వామి ఎల్ఐసీ సంస్థలో విధులు నిర్వహిస్తుండగా.. పెద్ద కుమారుడు ప్రణయ్ డిగ్రీ వరకు చదివాడు. చిన్న కుమారుడు ఉక్రెయిన్ చదువుకుంటుండగా, యుద్ధ సమయంలో స్వదేశానికి వచ్చిన అతడు ప్రస్తుతం హైదరాబాద్‌లో చదువుకుంటున్నాడు. కాగా, కులాంతర వివాహం చేసుకున్న ప్రణయ్ హత్యకు గురికావడంతో ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగింది. పెద్దకొడుకు ప్రణయ్ హత్య కేసులో తుది తీర్పు వచ్చిన సమయంలో బాలస్వామి తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. 'నాకు నా కుమారుడు లేడు, అమృతకు భర్త లేడు, నా మనువడికి తండ్రి లేడు' అంటూ కన్నీరుమున్నీరవుతూనే.. మారుతీరావు కూడా ఆత్మహత చేసుకోవడం కలిచి వేసిందన్నారు. ప్రణయ్ హత్య తరువాత కొద్ది నెలలు అత్తామామల వద్ద ఉన్న అమృత తన తండ్రి మరణం తరువాత తల్లిదగ్గరకు వచ్చేసింది. ప్రస్తుతం తన తల్లితో కలిసి హైదరాబాద్‌లో ఉంటోంది. తన భర్త హత్య వెనక తన బాబాయి శ్రవణ్‌కుమార్ ప్రమేయం ఉందని అప్పట్లో పోలీసులకు చెప్పడంతో హత్య కేసులో ఏ6గా ఉన్న శ్రవణ్ కుమార్‌కు సైతం యావజ్జీవ కారాగార శిక్ష పడటంతో రెండు కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయి. ఏది ఏమైనా పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకున్న అమృత, ప్రణయ్‌ల ప్రణయ గాథ విషాదంగా మారి ఆ కుటుంబాలను చిన్నాభిన్నం చేసింది.

అర్జీలకు సత్వరమే పరిష్కారం చూపాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

భానుపురి (సూర్యాపేట) : ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులకు సత్వరమే పరిష్కారం చూపాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. సోమవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎండల తీవ్రత పెరిగినందున ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాల్లో కూలీలకు షేడ్ నెట్స్ ఏర్పాటు చేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తగినన్ని మందులు, ఓఆర్ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలో జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని పాఠశాలు, హాస్టల్స్‌లో ఫ్యాన్లు వాడుకోనేలా సిద్ధం చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగునీటి ఎద్దడి రాకుండా చిన్నచిన్న మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలన్నారు. అనంతరం తెలంగాణ స్టేట్ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా శాఖ సభ్యులు తల్లిదండ్రుల వయోధికుల పోషణ, సంక్షేమ చట్టం 2007 నియమావళి – 2011 తెలిపే పోస్టర్‌ను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వీవీ అప్పారావు, డీఎఫ్ఓ సతీష్ కుమార్, సీపీఓ ఎల్.కిషన్, డీఎంహెచ్ఓ కోటాచలం, డీఈఓ అశోక్, డీటీడీఓ శంకర్, ఎస్సీ అభివృద్ధి అధికారి లత, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, మైనార్టీ అధికారి జగదీశ్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ పీడీ శ్రీనివాస్‌నాయక్, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా పరిశ్రమల అధికారి సీతారాం నాయక్, డీఎస్ఓ రాజేశ్వరరావు, డీసీఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏఓ సుదర్శన్ రెడ్డి, మెప్మా పీడీ రేణుక పాల్గొన్నారు.

సాగునీటికి ఇబ్బందులు కలగకుండా చర్యలు

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో సాగునీటికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ పాల్గొని మాట్లాడారు. ఆయకట్టు చివరి భూముల వరకు సాగునీరందేలా చూస్తామన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం

- ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నర్సింహ



నూతన ఎస్పీకి మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న డీఐజీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేటటౌన్ : జిల్లాల్లో శాంతిభద్రతల రక్షణకు అధికప్రాధాన్యం ఇవ్వనున్నట్లు నూతన ఎస్పీ కె.నర్సింహ వెల్లడించారు. సూర్యాపేట జిల్లా నూతన ఎస్పీగా ఆయన సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గత ఎస్పీ, డీఐజీ సన్ ప్రీత్ సింగ్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎస్పీకి అదనపు ఎస్పీలు నాగేశ్వరరావు, జనార్దన్ రెడ్డి, డీఎస్పీలు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా పోలీసులతో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. పేకాట, గంజాయి తరలింపు, ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తే ఉపేక్షించేదిలేదన్నారు.

వేగంగా పోలీస్ సేవలు

ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ జిల్లా పోలీస్ శాఖ 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండి విలువైన సేవలు వేగంగా అందిస్తామన్నారు. మహిళల పట్ల, పిల్లల పట్ల వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈవ్‌టీజింగ్ చేసే వారిని గుర్తించి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. సైబర్ మోసాల పై ప్రణాళికతో పని చేస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు.

ఖాళీలతో అవస్థలు..!

ఏళ్లుగా భర్తీకాని అంగన్‌వాడీ పోస్టులు

- ఆయా ఉంటే టీచర్ లేక.. టీచర్ ఉంటే ఆయా లేక ఇబ్బందులు
- ఉన్న టీచర్లు, ఆయాలపైనా పనిభారం
- లబ్ధిదారులకు సక్రమంగా అందని పౌష్టికాహారం



ఈ ఫొటోలో చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం ఇస్తున్నది ఆత్మకూర్ (ఎస్) మండలం మక్తాకొత్తగూడెంలోని అంగన్‌వాడీ సెంటర్‌లోనిది. ఈ సెంటర్ అంగన్‌వాడీ టీచర్ నాలుగేళ్ల క్రితం సూపర్‌వైజర్‌గా పదోన్నతి పొందారు. ఇక ఆయాకు 65 ఏళ్లు నిండడంతో పది నెలల క్రితం రిటైర్డ్ అయ్యారు. దీంతో సెంటర్‌లో 15 మందికి పైగా పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఇలా మొత్తం 40 మంది వరకు పౌష్టికాహారం ఇచ్చేందుకు బొప్పారం, శెట్టిగూడెం తండాకు చెందిన అంగన్‌వాడీ టీచర్లకు బాధ్యతలు అప్పగించాల్సిందిగా అధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ప్రతినెలా ఒకరోజున లబ్ధిదారులకు పౌష్టికాహారం ఇస్తున్నారు. ఇదీ జిల్లాలో చాలా సెంటర్లలో అదనపు బాధ్యతలతో టీచర్లు, ఆయాలు, సమయానికి పౌష్టికాహారం అందక పిల్లలు ఇబ్బంది పడుతున్నారు.

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏళ్ల తరబడి టీచర్, ఆయా పోస్టులు భర్తీకి నోచుకోవడంలేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో పనిచేస్తున్న వారిపై తీవ్ర పనిభారం పడుతోంది. ఇద్దరి పనిని ఒక్కరే చేయడం, సెలవు దొరకకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయా పోస్టుల భర్తీకి పలుమార్లు ప్రయత్నాలు జరిగినా ముందుకు సాగలేదు. దీంతో కొన్నేళ్లుగా పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.

వివిధ కారణాలతో ఖాళీ..

సూర్యాపేట జిల్లాలో ఐదు ప్రాజెక్టుల కింద 1,209 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. ఈ సెంటర్లలో 30వేల మంది దాకా చిన్నారులు, మరో 20వేల మంది దాకా గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం పొందుతున్నారు. అయితే అంగన్‌వాడీ టీచర్లు పనిచేస్తున్న కొందరు వివిధ ఉద్యోగాలు పొందడం, అంగన్‌వాడీల్లోనే సూపర్‌వైజర్లుగా పదోన్నతి పొందడంతో టీచర్ పోస్టులు ఖాళీ అయ్యాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం 65 ఏళ్లు నిండిన ఆయాలకు పదవీ విరమణ కల్పించడంతో ఆ పోస్టులు సైతం భారీగా ఖాళీ అయ్యాయి. మొత్తంగా జిల్లావ్యాప్తంగా 61 అంగన్‌వాటీ టీచర్, 200 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సంబంధిత శాఖ అధికారులు గతంలోనే గుర్తించారు.

భర్తీకి నోచుకోకపోవడంతో..

ఎన్నో సంవత్సరాలుగా అంగన్‌వాడీల పోస్టులు భర్తీకి నోచుకోకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయాలు ఉన్నచోట టీచర్ లేకపోవడంతో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందడం లేదు. ఇక టీచర్ ఉండి ఆయా లేనిచోట పిల్లలను తీసుకురావడం, తీసుకెళ్లడం, ఆలనాపాలనా చూడడం, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యలక్ష్మీ పథకం భోజనం వండిపెట్టడం వంటివి అందడం లేదు. ఇందులోనే ఇటీవల ఆయాలకు రిటైర్మెంట్ ఇవ్వడంతో కొన్నిచోట్ల టీచర్‌తో పాటు ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం పనిచేస్తున్న ఆయాలు, టీచర్లపైనా పనిభారం అధికమైంది. వెంటనే ప్రభుత్వం స్పందించి ఆయా, టీచర్ పోస్టులను భర్తీ చేయాలని లబ్ధిదారులు కోరుకుంటున్నారు.

త్వరలోనే భర్తీ కానున్నాయి

జిల్లాలో అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గతంలోనే ఈ ఖాళీలను గుర్తించి ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం త్వరలోనే ఈ పోస్టులను భర్తీ చేయనుంది. అప్పటి వరకు సెంటర్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

– నరసింహారావు, సంక్షేమాధికారి

నేత్రపర్వంగా మహాపూర్ణాహుతి, పుష్పయాగం

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు చివరి ఘట్టానికి చేరాయి. సోమవారం మహాపూర్ణాహుతి, శ్రీచక్రతీర్థం, పుష్పయాగం, దేవతలకు వీడ్కోలు పర్వాలు చేపట్టారు. ఉదయం యాగశాలలో నిర్వహించిన మహా పూర్ణాహుతి వేడుక సందర్భంగా.. బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన దేవతలను సుగంధద్రవ్యాలతో ఆరాధించి, పట్టు వస్త్రాలతో ఆవాహన చేసి నెయ్యితో అగ్ని భగవానుడికి సమర్పించారు. విశ్వశాంతి కోసం మహా పూర్ణాహుతి వేడుక నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. ఈ వేడుకలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పాల్గొని పూజలు నిర్వహించారు.

శ్రీచక్రతీర్థం..

మహావిష్ణువు ఆయుధమైన శ్రీచక్ర ఆళ్వారుడికి మధ్యాహ్నం ఒంటి గంటకు పూజలు చేసిన అనంతరం విష్ణు పుష్కరిణిలో శ్రీచక్రతీర్థం వేడుక వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను.. శ్రీచక్ర ఆళ్వారునికి అలంకరించి ప్రత్యేక పల్లకిపై అధిష్ఠింపజేసి పూజలు చేశారు. ఆ తరువాత ఆలయ మాడ వీధుల్లో ఊరేగిస్తూ విష్ణు పుష్కరిణికి వేంచేసి శ్రీచక్ర స్నానం వేడుక పూర్తి చేశారు.

దేవతలకు వీడ్కోలు

నిత్యారాధనల అనంతరం దేవతోద్వాసన, శ్రీపుష్పయాగం, దోపు ఉత్సవంనిర్వహించారు. మహోత్సవంలో దోషములు తొలగించేందుకు పుష్పయాగం చేపట్టారు. ఇక బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించిన దేవతలను తిరిగి స్వస్థలానికి పంపించే వేడుక దేవతోద్వాసన అని అర్చకులు పేర్కొన్నారు.



దేవతలకు వీడ్కోలు, శ్రీపుష్పయాగం వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

ట్రాక్టర్ ఢీకొని వృద్ధురాలు మృతి


బాలమ్మ (ఫైల్)

మునుగోడు: గొర్రెలను మేపేందుకు వెళ్తున్న వృద్ధురాలిని ట్రాక్టర్ ఢీకొట్టడంతో మృతిచెందింది. ఈ ఘటన సోమవారం మునుగోడు మండల కేంద్రం శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు మండలం కచలాపురం గ్రామానికి చెందిన చిరగోని బాలమ్మ(58) మునుగోడులో నివాసముంటున్న తన కుమారుడు వద్ద ఉంటూ గొర్రెలు కాస్తూ జీవనం సాగిస్తోంది. రోజుమాదిరిగా సోమవారం ఉదయం 10 గంటల సమయంలో గొర్రెలను మేతకు తోలుకుని వెళ్తుండగా.. మునుగోడు మండల కేంద్రం శివారు కమ్మగూడెం సమీపంలోని చొల్లేడు రోడ్డులో అతివేగంగా వచ్చిన ట్రాక్టర్ ఆమె ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. ట్రాక్టర్ డ్రైవర్ అతివేగంగా నడపడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. మృతురాలి కుమారుడు చిరగోని లింగస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

భువనగిరి: భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపురం గ్రామంలో ఆదివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బీఎన్ తిమ్మాపురం గ్రామానికి చెందిన పిన్నం నర్సింహ(63)కు తన వ్యవసాయం బావి వద్ద భూమి విషయమై, పైపులైన్ ద్వారా నీరు తరలించే విషయమై అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులతో గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం సాయంత్రం కూడా బావి వద్ద గొడవ జరుగుతుండగా.. గ్రామస్తులు గమనించి నర్సింహ కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. రాత్రి 9గంటల సమయంలో నర్సింహ కుటుంబ సభ్యులు బావి వద్దకు వెళ్లగా.. అతడు అక్కడ ఉన్న మంచం పై స్పృహతప్పి పడిపోయి ఉన్నాడు. వెంటనే 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా.. అప్పటికే మృతిచెందినట్లు 108 వాహన సిబ్బంది తెలిపారు. మృతుడి కుమార్తె మానస ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

అప్పుల బాధతో కౌలు రైతు బలవన్మరణం


మోటె నర్సింహ (ఫైల్)

రామన్నపేట: అప్పుల బాధతో కౌలు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలో జరిగింది. సిరిపురం గ్రామానికి మోటె నర్సింహ(50) కొన్నేళ్లుగా గ్రామశివారులో పద్నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. వానాకాలంలో వరితో పాటు పత్తి సాగు చేశాడు. ప్రస్తుత యాసంగిలో వరి సాగు చేశాడు. బోర్లు ఎండిపోవడంతో సగానికి పైగా వరి పొలం ఎండిపోయింది. వ్యవసాయ పెట్టుబడుల కోసం చేసిన అప్పులు పెరుగుతుండడంతో కొద్దిరోజులుగా ఆందోళన చెందసాగాడు. సోమవారం ఉదయం స్థానిక శివాలయానికి వెళ్లి పూజలు చేశాడు. అనంతరం పొలం చూడడానికి వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. పెట్టుబడి కోసం చేసిన అప్పుల ఎలా తీర్చాలో తెలియక ఆందోళనకు గురై పురుగులమందు తాగాడు. అనంతరం ఇంటికి తిరిగివచ్చి మంచంపై పడుకొని వాంతులు చేసుకొని అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు గమనించి చుట్టుపక్కల వారి సహాయంతో 108 వాహనంలో రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే నర్సింహ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పిల్లలకు 'ప్రేమ'గా చెప్పాలి

పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించాలని, వారు ప్రేమలో పడితే కూర్చొని మాట్లాడి ప్రతి విషయాన్ని వారితో చర్చించడంతో పాటు ప్రేమగా చెప్పి చూడాలని, తప్పనిసరైతే వారి ప్రేమను తల్లిదండ్రులు అంగీకరించాలని న్యాయవాదులు, లీగల్ కౌన్సిల్ సభ్యులు సూచిస్తున్నారు. మిర్యాలగూడలో సంచలనం సృష్టించిన ప్రణయ్ హత్య కేసులో సోమవారం తుది తీర్పు వెలువడిన నేపథ్యంలో ప్రేమ, పిల్లల పెంపకంపై న్యాయవాదులు, లీగల్ కౌన్సిల్ సభ్యులు, తల్లిదండ్రుల అభిప్రాయాలు ఇలా..

విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని కల్గిఉండేలా తీర్చిదిద్దాలి



సూర్యాపేట: తల్లిదండ్రులు తమ పిల్లలు చిన్నప్పటి నుంచే ఒక లక్ష్యం కలిగి ఉండేలా తీర్చిదిద్దాలి. హైస్కూల్ విద్య నుంచే తమ కుటంబ నేపథ్యం, వారి స్థాయిని పిల్లలకు తెలిసేలా చేయాలి. సమాజంలో ఎలా ప్రవర్తించాలో నేర్పించాలి. లక్ష్యం మీదనే ఫోకస్ చేసేలా, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండేలా చూడాలి. వివిధ రంగాల్లో ప్రావీణ్యం సాధించే వారు ఏవిధంగా సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉంటున్నారో వివరించాలి. చెడు వ్యసనాలకు, చెడు స్నేహాలకు దూరంగా ఉండేలా చూసుకోవాలి.

– తల్లమల్ల హుస్సేన్, పూర్వపు ప్రభుత్వ న్యాయవాది, సూర్యాపేట

ప్రేమను అంగీకరించడమే మేలు

నల్లగొండ: తల్లిదండ్రులు పిల్లల ప్రేమ విషయంలో మొదట వారు ఎటువంటి వారు అనేది ముందుగా తెలుసుకోవాలి. కుమార్తె అయినా, కుమారుడు అయినా ప్రేమలో ఎంత వరకు వెళ్లారు అనే విషయం తల్లిదండ్రులు గమనించాలి. ఒకవేళ వారికి కౌన్సిలింగ్ చేస్తే ఒప్పుకుంటారా లేదా అనేది చూడాలి. ప్రేమలో లోతుగా ఉంటే మాత్రం పిల్లల భవిష్యత్‌ను ఆలోచించి అంగీకరించినట్లుగానే ఉంటూ అవతలి వ్యక్తి పరిస్థితి తెలుసుకోవాలి. ఆస్తి లేకున్నా పర్వాలేదు కలిసి బతుకుతారు అనుకుంటే ఆ ప్రేమ వివాహాన్ని ఒప్పుకోవడమే మేలు. పిల్లల ప్రేమ విషయంలో తల్లిదండ్రులు ఆచితూచి వ్యవహరించాలి.

– గీత, న్యాయవాది, సఖీ కేంద్రం లీగల్ కౌన్సిలర్, నల్లగొండ

పిల్లల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి



సూర్యాపేట: పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. వారి ప్రవర్తన, నడవడికను గమనిస్తూ.. తప్పడగులు వేస్తున్నారని తెలిస్తే దండించకుండా ఏది చేదు, ఏది మంచి అనే విషయాన్ని వారు గ్రహించే విధంగా అవగాహన కల్పించాలి. వివిధ రంగాల్లో విజయం సాధించిన వారి గుర్చి పిల్లలకు వివరించాలి. పిల్లలతో స్నేహంగా మెలగాలి, పిల్లల సెల్‌ఫోన్‌ను గమనిస్తూ ఉండాలి. తాత్కాలిక ఆనందాన్ని ఇచ్చే అంశాలకు దూరంగా ఉంచాలి. పిల్లలు ఎప్పుడు బిజీగా ఉండే విధంగా చదువుతో పాటు వ్యాయామం, డ్యాన్స్, చిత్రలేఖనం వంటి వాటిని నేర్పించాలి.

– బొల్లెద్దు వెంకటరత్నం, న్యాయవాది

తల్లిదండ్రులను రోడ్డుమీద పడేయొద్దు



నల్లగొండ: తల్లిదండ్రులను రోడ్డు మీదకు వచ్చేలా పిల్ల లు చేయొద్దు. పిల్లలు తల్లిదండ్రులు కుదిర్చిన వివాహాలు చేసుకోవడమే మంచిది. ఏదైనా జరగరాని సంఘటన జరిగితే వారికి రెండు కుటుంబాలు అండగా ఉంటాయి. పిల్లలు తొందరపడి తెలిసీతెలియని వయసులో ప్రేమలో పడటం తల్లిదండ్రులు ఒప్పుకోక ఎదిరించి పెళ్లి చేసుకోవడం ఇటు తల్లిదండ్రులకు దూరమవడమే కాదు వారిని రోడ్డు మీద వేసిన వారవుతారు. ఇలాంటిది మంచిది కాదు.

– చిరుమర్తి శ్రీను, నల్లగొండ

పిల్లల ప్రవర్తనను గమనించాలి



నల్లగొండ టౌన్: పిల్లల ప్రవర్తనను గమనించాలి. చదువుతో పాటు వారు ఏమి చేస్తున్నారు... ఎక్కడికి వెళుతున్నారు.. ఎలాంటి స్నేహం చేస్తున్నారు అనే దాన్ని ముఖ్యంగా తల్లిదండ్రులు గమనించాలి. ఒకవేళ ప్రేమలో పడితే వారి కుటుంబ నేపథ్యం, వారి స్థితిగతులు తెలుసుకోవాలి. అన్ని సక్రమంగా ఉంటే పిల్లల అభిప్రాయాన్ని అంగీకరించాలి. లేకపోతే వారు తప్పుదోవ పట్టే అవకాశం ఉంటుంది. కాబట్టి మంచి కుటుంబ నేపథ్యమైతే ప్రేమ వివాహాలను అంగీకరించడంలో తప్పులేదు.

– పవన కాశయ్యగౌడ్, గుండ్లపల్లి, నల్లగొండ

పిల్లల కోరిక మన్నించి వివాహాలు చేయాలి



మిర్యాలగూడ: పిల్లలు ప్రేమించుకుంటే తల్లిదండ్రులు వారి కోరికను మన్నించి పెళ్లిళ్లకు అనుమతించాలి. కులం, పరువు ప్రతిష్టలు అనే అహంకారంతో హత్యలకు పాల్పడితే చట్టాల నుంచి తప్పించుకోలేరనే విషయాన్ని గుర్తించంచాలి. చట్ట ప్రకారం మేజర్లు అయితే పిల్లలు తమకు నచ్చిన వారిని పెళ్లి చేసుకునే స్వేచ్ఛను రాజ్యాంగం కల్పించింది. అంబేద్కర్ స్ఫూర్తితో కులరహిత సమాజం వైపు అడుగులు వేయాలి. పిల్లలు కూడా సినిమా, టీవీల ప్రభావంలో ఆకర్షణలకు లోనై అదే ప్రేమ అనుకొని తల్లిదండ్రులను శత్రువులుగా చూసే వైఖరిని మానుకోవాలి. తల్లిదండ్రులను ఒప్పించి పెద్దలను మెప్పించి పెళ్లి చేసుకునే ప్రయత్నం చేయాలి.

– కస్తూరి ప్రభాకర్, సామాజికవేత్త, మిర్యాలగూడ

జీవితంలో స్థిరపడేలా ప్రోత్సహించాలి



నల్లగొండ టౌన్ : తల్లిదండ్రులు పిల్లల ప్రేమను ప్రోత్సహించొద్దు. ముందుగా తమ పిల్లలను సక్రమంగా చదువుకుని జీవితంలో స్థిరపడేలా ప్రోత్సహించాలి. ఒకవేళ ప్రేమ వివాహం చేసుకున్నా చంపడం, దాడులు చేయడం, కేసులపాలు కావడం మంచి పద్ధతి కాదు. ప్రతిష్టకు పోయి వారి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు. సామరస్యంగా రెండు కుటుంబాలు కలిసి సమస్య పరిష్కరించుకుంటే మంచిది. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వారిని సరైన మార్గంలో పయనించేలా దిశా నిర్దేశం చేయాలి. వారి ప్రవర్తనలో మార్పు వస్తే వెంటనే గమనించి వారు సరైన రీతిలో ఉండేలా తల్లిదండ్రులు సూచనలు చేయాలి.

– డాక్టర్ సుబ్బారావు, మానసిక వైద్య నిపుణుడు, నల్లగొండ

ప్రేమ విషయం తెలిస్తే మాట్లాడుకోవాలి



మిర్యాలగూడ: పిల్లల ప్రేమ విషయం గురించి తల్లిదండ్రులకు తెలిసినప్పుడు ముందుగా తల్లిదండ్రులు, పిల్ల లు కలిసి మాట్లాడుకోవాలి. వాళ్ల మధ్య సమన్వయం కుదరకుంటే నిపుణుల సలహాలు తీసుకోవడం మంచిది. తమ ప్రేమను ఒప్పుకోరు అనే భావనతో పిల్లలు సొంత నిర్ణయాలు తీసుకుంటారు. ప్రేమ విషయాన్ని తీవ్రంగా పరిగణించకుండా కూర్చొని మాట్లాడుకోవడం మంచిది. హత్యలు అనేది ఎప్పటికి కూడా పరిష్కారం కాదు.

– యామినిదేవి, సీనియర్ న్యాయవాది, మిర్యాలగూడ

ప్రణయ్ హత్య కేసు కొనసాగిందిలా..

మిర్యాలగూడ అర్బన్: 2018 సెప్టెంబర్ 14న మిర్యాలగూడ పట్టణంలో ప్రణయ్ హత్య జరగగా 15వ తేదీన హైదరాబాద్‌లోని గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో అమృత తండ్రి మారుతీరావు, మారుతీరావు సోదరుడు శ్రవణ్‌కుమార్‌తో పాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు.

- అనంతరం పోలీసుల విచారణలో ఉగ్రవాద సంస్థ మాజీ సభ్యుడు అస్గర్ అలీ, మహ్మద్ బారీ ప్రమేయం ఉన్నట్లు నిర్ధారణ కావడంతో ఆ దిశగా దర్యాప్తు మొదలై మిర్యాలగూడ పట్టణానికి చెందిన అప్పటి కాంగ్రెస్ నాయకుడు అబ్దుల్ కరీంతో కలిసి సుపారీ కుదిర్చినట్లు తేలింది. ఈ హత్యలో బిహార్‌కు చందిన సుభాష్‌శర్మ పాత్ర ఉన్నట్లు గుర్తించారు.
- సెప్టెంబర్ 18న ప్రణయ్ హత్య కేసులో ప్రమేయం ఉన్న నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏ–1గా మారుతీరావు, ఏ–2గా సుభాష్‌శర్మ, ఏ–3గా అస్గర్ అలీ, ఏ–4గా అబ్దుల్ బారీ, ఏ–5గా కరీం, ఏ–6గా మారుతీరావు తమ్ముడు శ్రవణ్‌కుమార్, ఏ–7గా మారుతీరావు కారు డ్రైవర్ శివ, ఏ–8గా ఆటో డ్రైవర్ నదీంపై 302, 303, రెడ్ విత్ 34, 120(బీ), 109, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలోని సెక్షన్–3 క్లాస్(2,5) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.
- నిందితులను సెప్టెంబర్ 19న మిర్యాలగూడ కోర్టులో హాజరుపర్చగా కోర్టు 14రోజుల రిమాండ్ విధించింది. రిమాండ్ గడువు ముగిసిన తర్వాత ఏ–1 నుంచి ఏ–6 వరకు నిందితులను వరంగల్ సెంట్రల్ జైలుకు తరలించారు. వరంగల్ సెంట్రల్ జైలులో ఏడు నెలల పాటు రిమాండ్‌లో ఉన్న మారుతీరావు, శ్రవణ్‌కుమార్, అబ్దుల్ కరీంలకు 2019 ఏప్రిల్ 29న షరతులతో కూడిన బెయిల్ లభించింది.
- హత్యకు గురైన ప్రణయ్ భార్య అమృత 2019 జనవరి 30న హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చింది. తమ ప్రేమ వివాహం రోజున పుట్టిన బిడ్డకు నిహాల్‌ప్రణయ్ అని నామకరణం చేసింది.
- వరంగల్ సెంట్రల్ జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చిన మారుతీరావు తన కుమార్తె అమృతతో రాజీకుదుర్చుకునేందుకు రాయబారం పంపాడు. తనకు అనుకూలంగా సాక్ష్యం చెబితే ఆస్తినంతా రాసి ఇస్తానంటూ ప్రలోభపెట్టేందుకు 2019 సెప్టంబర్ 30 మాజీ కౌన్సిలర్ కందుల వెంకటేశ్వర్లు, రిటైర్డ్ తహసీల్దార్ భాస్కర్‌రావును పంపాడు. తండ్రి ప్రతిపాదనను తిరస్కరించిన అమృత అదే రోజు మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసులో కందుల వెంకటేశ్వర్లు, భాస్కర్‌రావు, అబ్దుల్ కరీంపై కేసు నమోదు చేసి రిమాండ్ చేశారు.
- ప్రణయ్ హత్య కేసుకు సంబంధించి 1200 పేజీలతో కూడిన ఛార్జిషీట్‌ను 2019 జూన్ 12న పోలీసులు నల్లగొండ కోర్టులో దాఖలు చేయగా కేసు విచారణ మొదలైంది.
- 2020 ఫిబ్రవరి 29న నార్కట్‌పల్లి–అద్దంకి బైపాస్ సమీపంలో మారుతీరావు ఇంటి స్థలంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల విచారణలో ఆ మృతదేహం హత్యకు గురైంది కాదని నిర్ధారణయ్యింది. అతడి ఆచూకీ కోసం పోలీసుల విచారణ కొనసాగుతోంది.
- ప్రణయ్ హత్య కేసు విచారణ నల్లగొండ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో 2020 ఫిబ్రవరి 27న ప్రారంభమైంది. తిరిగి మార్చి 10న విచారణ జగాల్సి ఉండగా మార్చి 8న హైదరాబాద్‌లో మారుతీరావు ఆత్మహత్య చేసుకున్నాడు.
- 5 సంవత్సరాల 9 నెలల సుదీర్ఘ విచారణ తర్వాత కోర్టు నిందితులకు శిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెల్లడించింది.

నిరుద్యోగ యువతే టార్గెట్..

- ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసి బురిడీ కొట్టించిన నకిలీ డీఎస్పీ
- నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట ఎస్పీ నర్సింహ

సూర్యాపేట టౌన్ : నిరుద్యోగ యువతను టార్గెట్ చేసి ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.లక్షల్లో వసూలు చేసి మోసం చేసిన నకిలీ డీఎస్పీని సూర్యాపేట పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈ కేసు వివరాలను ఎస్పీ కె. నర్సింహ విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన బత్తుల శ్రీనివాసరావు సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశతో నకిలీ డీఎస్పీ అవతారమెత్తాడు. తాను డీఎస్పీ అని చెప్పుకుంటూ పలువురిని పరిచయం చేసుకొని అమాయకులైన నిరుద్యోగ యువతకు పోలీస్, సివిల్ సప్లయ్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తూ బురిడీ కొట్టించాడు. కోదాడలో ఒక అమ్మాయికి ఎస్ఐ ఉద్యోగం ఇప్పిస్తానని ఆమె వద్ద రూ.36లక్షలు వసూలు చేశాడు. అదే విధంగా ఏపీలోని మార్టూర్‌కు చెందిన వ్యక్తికి కానిస్టేబుల్ ఉద్యోగం ఇప్పిస్తానని, గురజాలకు చెందిన మరో వ్యక్తికి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని పరారీలో ఉన్నాడు. కోదాడకు చెందిన అమ్మాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన సూర్యాపేట పట్టణ పోలీసులు సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీగ్రాండ్ హోటల్ వద్ద శ్రీనివాసరావును అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరం ఒప్పుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడి వద్ద రూ.18లక్షల నగదు, ఒక కారు, పోలీస్ యూనిఫాం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. నిందితుడిపై గతంలో పలు కేసులు ఉండగా.. 2022లో జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చి మళ్లీ అదే పనిచేస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. ఈ కేసును ఛేదించిన సూర్యాపేట పట్టణ సీఐ వీపీ రాఘవులు, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీ రవి, పట్టణ సీఐ వీపీ రాఘవులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తి గంజాయి తరలిస్తుండగా మునగాల పరిధిలో పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం ఎస్పీ నర్సింహ విలేకరులకు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా అంగోటుగూడ గ్రామానికి చెందిన సను ఖిలా అలియాస్ శ్రీను అదే జిల్లాలోని పుల్లికొండ గ్రామానికి చెందిన పూర్ణ దగ్గర గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఆదివారం పూర్ణ వద్ద 30కిలోల గంజాయిని కిలో రూ.1500 చొప్పున కొనుగోలు చేసిన సను ఖిలా ఆ గంజాయిని 15 ప్యాకెట్లుగా మార్చి ఒక బస్తాలో పెట్టుకొని ఒడిశా నుంచి లారీలో హైదరాబాద్‌కు బయల్దేరాడు. లారీ మునగాల సమీపంలోకి రాగానే డ్రైవర్ హైదరాబాద్ వైపు లారీ వెళ్లడం లేదని చెప్పడంతో అక్కడ విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై దిగిపోయాడు. హైదరాబాద్‌కు వెళ్లేందుకు సోమవారం వాహనాలను ఆపుతుండగా అటుగా వెళ్తున్న పోలీసులు అతడిని పట్టుకున్నారు. నిందితుడి నుంచి 30కిలోల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. పూర్ణ పరారీలో ఉన్నట్లు చెప్పారు. నిందితుడిని పట్టుకున్న మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది, పర్యవేక్షణ చేసిన సీఐ రామకృష్ణారెడ్డిని ఎస్పీ అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు వద్ద తీవ్ర ఉత్కంఠ

- ఏ2 సుభాష్‌కుమార్‌శర్మకు మరణశిక్ష
- ఏ3 నుంచి ఏ8 వరకు ఆరుగురికి జీవితఖైదు
- తీర్పుకోసం భారీగా తరలివచ్చిన ప్రజాసంఘాల నాయకులు
- కన్నీటి పర్యంతమైన నిందితుల కుటుంబీకులు
- కోర్టు వద్ద భారీ పోలీసు బందోబస్తు


నల్లగొండ జిల్లా కోర్టు ఆవరణలో గుమికూడిన ప్రజలు, న్యాయవాదులు, పోలీసులు

రామగిరి(నల్లగొండ): సంచలనం సృష్టించిన మిర్యాలగూడకు చెందిన పెరుమాళ్ల ప్రణయ్ హత్య కేసులో తుదితీర్పు నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచి నల్లగొండ కోర్టు వద్ద ఉత్కంఠ వాతావరణం నెలకొంది. ఈ కేసు నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు, రెండవ అదనపు జడ్జి ఎన్.రోజారమణి సోమవారం అంతిమ తీర్పు వెల్లడించారు. సెప్టెంబర్ 14, 2018న ప్రణయ్ హత్యకు గురికాగా.. అప్పటి ఎస్పీ ఏవీ రంగనాథ్ విచారణ జరిపి హత్య కేసులో ప్రమేయం ఉన్న 8 మందిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దర్శనం నరసింహ హత్య కేసులో అన్ని సాక్ష్యాధారాలు కోర్టుకు సమర్పించారు. నరసింహ వాదనలతో ఏకీభవించిన నల్లగొండ ఎస్సీ, ఎస్టీ రెండవ అనదపు జడ్జి ఎన్.రోజారమణి ఏ2 సుభాష్‌కుమార్‌శర్మకు ఉరిశిక్షతో పాటు రూ.15 వేల జరిమానా లేదా 4 నెలల జైలు శిక్ష, మిగిలిన ఆరుగురు ఏ3 అజ్గర్ అలీ, ఏ4 మహ్మద్ అబ్దుల్‌బారీ, ఏ5 అబ్దుల్ కరీం, ఏ6 తిరునగరు శ్రవణ్‌కుమార్, ఏ7 సముద్రాల శివ, ఏ8 ఎంఏ.నిజాంకు జీవిత ఖైదు రూ.10 వేల జరిమాన లేదా 4 నెలల జైలుశిక్ష విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించారు. ఈ కేసులో ఏ1 నిందితుడు అమృవర్షిణి తండ్రి తిరునగరు మారుతీరావు 2020 మార్చి 8న ఆత్మహత్య చేసుకోగా.. అజ్గర్‌అలీని అహ్మదాబాద్ సబర్మతి జైలుకు, శుభాష్‌కుమార్‌శర్మను చర్లపల్లి జైలుకు తరలించారు. మిగిలిన ఐదుగురు నిందితులకు నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి నల్లగొండ జిల్లా జైలుకు తరలించారు. ఈ తీర్పుతో ప్రణయ్ కుటుంబ సభ్యులు, పలువురు ప్రజా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

భారీగా తరలిన వచ్చిన ప్రజా సంఘాలు, ప్రజలు..

ప్రణయ్ హత్య కేసు తీర్పు సోమవారం వెలువడుతుందన్న విషయం తెలుసుకున్న ప్రజా సంఘాల నాయకులతో పాటు సామాన్య ప్రజలు నల్లగొండ కోర్టు వద్దకు భారీగా తరలివచ్చారు. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టినప్పటి నుంచి తీర్పు ఎప్పుడు వస్తుందా అని ఆసక్తిగా వేచిచూశారు.

నిందితుల కుటుంబాల కన్నీటి పర్యంతం..

హత్య కేసులో నిందితులుగా ఉన్న ఏడుగురికి శిక్ష పడింది. దీంతో నిందితుల కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. కోర్టు ఆవరణలో తిరునగరు శ్రవణ్‌కుమార్ కూతురు శృతి బోరున విలపించింది. తన తండ్రికి ఎలాంటి నేరం చేయలేదని అయినప్పటికీ శిక్ష పడిందంటూ కన్నీరు పెట్టుకుంది. వీరితో పాటు మిగతా నిందితుల కుటుంబ సభ్యులు కూడా కోర్టు వద్ద, ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో వారితో మాట్లాడుతూ, అనంతరం వాహనంలో తరలిస్తున్న క్రమంలో కన్నీరు పెట్టుకున్నారు.

కోర్టు ప్రాంగంలో పోలీసుల భారీ బందోబస్తు..

ప్రణయ్ హత్య కేసులో తుది తీర్పు నేపథ్యంలో నల్లగొండ కోర్టు వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కోర్టు లోపలికి ఎవరినీ రానివ్వకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. న్యాయవాదులు, సిబ్బందిని, కుటుంబ సభ్యులను మాత్రమే కోర్టు లోపలికి అనుమతించారు.

తీర్పులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ తీరు భేష్

ప్రణయ్ హత్య అనంతరం తండ్రి బాలస్వామి మిర్యాలగూడ వన్‌టౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ప్రణయ్ తండ్రి బాలస్వామి అభ్యర్థన మేరకు కేసు వాదించేందుకు దర్శనం నరసింహను స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బలమైన సాక్షాధారాలు సేకరించారు. నిందితుల ఫోన్‌కాల్ డేటా, లోకేషన్, సీసీ టీవి ఫుటేజీలను సేకరించి.. 472 పేజీల లిఖిత పూర్వక రిపోర్టును కోర్టుకు సమర్పించారు.


నిందితులను బస్సులో జైలుకు తీసుకెళ్తుండగా రోదిస్తున్న వారి కుటుంబ సభ్యులు


కోర్టు తీర్పు అనంతరం రోదిస్తున్న మారుతీరావు సోదరుడు శ్రవణ్ కుమార్తె

మల్టీలెవల్ మార్కెటింగ్ వ్యవస్థాపకుడి అరెస్ట్

- రూ.8.40లక్షల విలువైన ద్విచక్రవాహనాలు, సామగ్రి స్వాధీనం

మిర్యాలగూడ అర్బన్: అమాయక ప్రజలకు నాసిరకం వస్తువులను అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్న మల్టీలెవల్ మార్కెటింగ్ వ్యవస్థాపకుడిని మిర్యాలగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్పీ రాజశేఖర రాజు విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండ జిల్లా కేంద్రానికి చెందిన మోటపోతుల వెంకటేష్ మల్టీలెవల్ మార్కెటింగ్ సంస్థను ఏర్పాటు చేసి రూ.9945 చెల్లించిన వారికి ఒక ఐడీ క్రియేట్ చేసి వారికి నాసిరకం వస్తువులు, ద్విచక్ర వాహనాలు, టీవీలు అంటగట్టేవాడు. ఇలా వస్తువులు తీసుకున్న వారితో మరికొంత మందిని సభ్యులుగా చేర్పించి భారీగా కమీషన్ ఇస్తామని చెప్పేవాడు. ఇది గుర్తించిన మిర్యాలగూడకు చెందిన బొంగరాల సంజీవ్ ఈ నెల 4వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు సోమవారం హన్మకొండలో వెంకటేష్‌ను అరెస్ట్ మిర్యాలగూడకు తీసుకొచ్చి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. అతడి వద్ద నుంచి రూ.8.40లక్షల విలువైన ద్విచక్ర వాహనాలు, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఈ కేసు ఛేదించిన సీఐ నాగార్జున, వన్‌టౌన్ ఎస్ఐలు సైదిరెడ్డి, శ్రీనివాస్, కానిస్టేబుల్ వీరబాబును డీఎస్పీ అభినందించారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ.. ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

గుండాల: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గుండాల మండలం పాచిల్ల గ్రామంలో సోమవారం జరిగింది. వివరాలు.. గుండాల మండలం వస్తాకొండూర్ గ్రామానికి చెందిన సుంకరి మహేష్(35) సోమవారం ద్విచక్ర వాహనంపై గుండాల నుంచి వస్తాకొండూర్‌కు వెళ్తున్నాడు. అదే సమయంలో వంగాల గ్రామానికి చెందిన చిప్పలపల్లి శంకర్ బైక్‌పై గుండాలకు వస్తుండగా.. పాచిల్ల మోడల్ స్కూల్ వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 వాహనంలో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే సుంకరి మహేష్ మృతిచెందాడు. శంకర్‌ను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

పెళ్లికి నిరాకరించిన ప్రియుడు.. యువతి ఆత్మహత్య

మర్రిగూడ: ప్రేమించిన వ్యక్తి పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపం చెందిన యువతి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సోమవారం మర్రిగూడ మండలం దామెరభీమనపల్లి గ్రామంలో జరిగింది. స్థానిక ఎస్ఐ కె. రంగారెడ్డి, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దామెరభీమనపల్లి గ్రామానికి చెందిన రాజగోని రజిత(21) అదే గ్రామానికి చెందిన గొడ్డేటి నవీన్ గత నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. రజిత ఇంటర్మీడియట్ వరకు చదివి వ్యవసాయ పనుల్లో తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటోంది. అయితే నవీన్ రజితను కాదని ఇటీవల తన తల్లిదండ్రులు చూపించిన యువతితో పెళ్లికి అంగీకరించాడు. దీంతో రజిత సోమవారం ఉదయం ఫోన్‌లో నవీన్‌తో మాట్లాడినప్పటికీ అతడు ఆమెను పెళ్లి చేసుకోవడానికి నిరాకరించడంతో మనస్తాపానికి గురైన రజిత ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి రాజగోని నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నవీన్‌తో పాటు అతడి తల్లిదండ్రులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రూప్–1 ఉద్యోగాలకు ముగ్గురు అర్హత


మందడి నాగార్జునరెడ్డి


అల్లి కీర్తన


భూక్య సందీప్

తిరుమలగిరి(నాగార్జునసాగర్): రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్–1 మెయిన్స్ ప్రొవిజినల్ మార్కులు సోమవారం విడుదల చేయగా.. నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం బోయగూడెం గ్రామానికి చెందిన మందడి నాగార్జునరెడ్డి, అల్లి కీర్తన ఉద్యోగాలకు అర్హత సాధించారు. మందడి నాగార్జునరెడ్డి 2006 డీఎస్సీలో ఎస్‌జీటీగా ఎంపికయ్యారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా కొనసాగుతూనే గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యారు. 2011లో అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఎంపికై కొద్దికాలం పనిచేసిన తర్వాత అదే ఏడాదిలో విడుదలైన గ్రూప్–2 ఫలితాల్లో డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంపికయ్యారు. నాగార్జునరెడ్డి ప్రస్తుతం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ తహసీల్దార్‌గా కొనసాగుతూనే గ్రూప్–1కు ప్రిపేర్ అయ్యి 488 మార్కులతో అర్హత సాధించారు.

మొదటి ప్రయత్నంలోనే విజయం..

బోయగూడెం గ్రామానికే చెందిన అల్లి నాగమణి, పెద్దిరాజు దంపతుల కుమార్తె అల్లి కీర్తన మొదటి ప్రయత్నంలోనే తన కలను సాకారం చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గ్రూప్–4 ఫలితాల్లో ఆమె జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికైంది. గ్రూప్–1 ఉద్యోగానికి 468.5 మార్కులతో అర్హత సాధించింది.

గుండెపురి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడికి..

సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం గుండెపురి పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న భూక్య సందీప్ 468.5 మార్కులతో గ్రూప్–1కు అర్హత సాధించారు.